క్లుప్తంగా

6 నుంచి హనుమాన్ దీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్‌అర్బన్: ఏప్రిల్ 23న మంగళవారం చైత్ర పౌర్ణమి హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఈ నెల 6వ తేదీ నుంచి 108 రోజుల దీక్షలను జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ప్రారంభించనున్నట్లు ఆలయ అర్చకుడు ఒజ్జల శిరీష్‌శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 12 నుంచి మండల దీక్షలు (41రోజులు), అర్ధ మండల దీక్షలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి, ఏకాదశ దీక్షలు ఏప్రిల్ 13 నుంచి మాలధారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94949 34924లో సంప్రదించాలని సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎస్సై కొమురయ్య

పెంచికల్‌పేట్: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఎస్సై కొమురయ్య అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. యువత చదువుతో పాటు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపాసీ సంజీవ్, మాజీ సర్పంచ్ ఎల్కరి సుధాకర్, నిర్వాహకులు సాయికిరణ్, సురేశ్, ఆత్రం సిద్దు, తిరుపతి, అరుణ్, రాజేశ్, ఉపాసీ నారాయణ, ఎల్కరి లచ్చన్న యువకులు పాల్గొన్నారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం షీటీం సిబ్బంది అవగాహన కల్పించారు. షీటీం కాగజ్‌నగర్ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో మహిళలు, యువతులకు షీటీం సేవలు, ఫోన్ నంబర్లు, తదితర వాటిపై అవగాహన కల్పించారు.

రైతులకు అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్: పశువుల పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారి మురళీ కృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని మోగుబాయి గూడలో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పశువులకు గాలికుంటు వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయని, ముందుగానే టీకాలు వేయించుకోవాలని సూచించారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమంలో పాల్గొననున్న ఆయన ఆ తర్వాత 11 గంటలకు బాలాజీనగర్‌లో నిర్వహించనున్న ప్రజాపాలన సదస్సుకు హాజరు కానున్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

జైనూర్: గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి రాజు అన్నారు. మంగళవారం మండలంలోని కొండపాటర్, పానపటార్ గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలు వేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. రోగాల బారిన పడిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో రమేశ్, హెచ్ఎస్ లక్ష్మికుమారి, తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: ఇటీవల మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్ద దిక్కు కోల్పోయిన పేద కుటుంబానికి ఎస్సై చంద్రశేఖర్ అండగా నిలిచారు. మండలంలోని పైకాజీగూడకు చెందిన సునార్కర్ వినోద్ అనే యువకుడు మృతి చెందగా ఎస్సై చంద్రశేఖర్ బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5వేల విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

వరి కొయ్యలకు నిప్పు.. ముప్పు

- కాల్చవద్దంటున్న అధికారులు
- భూసారం తగ్గుతుందని హెచ్చరిక
- భూమిలోనే కలియదున్నితే మేలని సూచన



సాండ్‌గాం గ్రామ శివారులో వరి కొయ్యలకు నిప్పు పెడుతున్న రైతు

కౌటాల: జిల్లాలో రైతులు ప్రస్తుతం వరి కోతలు పూర్తి చేసుకొని కొయ్యకాళ్లను కాల్చి యాసంగి పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. వరి కొయ్యకాళ్లను కాల్చితే భూసారం తగ్గడంతో పాటు కాల్చే సమయంలో జాగ్రత్తలు వహించకుంటే పెను ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. వరి కొయ్యలను కాల్చకుండా భూమిలో కలియదున్నితే అనేక లాభాలు ఉన్నాయంటున్నారు.

57వేల ఎకరాల్లో సాగు..

ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 57వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. ఇప్పటికే దాదాపు అన్ని ప్రాంతాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. వరికోతల అనంతరం కొయ్యకాళ్లను కాల్చే సమయంలో రైతులు ఏ మాత్రం ఆదమరిచినా పెను ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. కూలీల కొరత కారణంగా చాలా గ్రామాల్లో రైతులు వరికోత యంత్రాల (హార్వేస్టర్ల)తో పంట కోతలు చేపట్టారు. కోతలు పూర్తయిన తర్వాత వ్యవసాయ భూముల్లో మిగిలిపోయిన కొయ్యకాళ్లను కాలుస్తుంటారు. ఈ సమయంలో రైతులు చాలా అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కొందరు రైతుల నిర్లక్ష్య ధోరణితో గతంలో అగ్ని ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి.

మేలు చేసే కీటకాలు మృతి..

వరి కోతలకు యంత్రాలు లేనప్పుడు రైతులు కూలీలను పెట్టి కొడవళ్లతో పంట కోతలు చేపట్టేవారు. కళ్లాలు ఏర్పాటు చేసుకొని ధాన్యాన్ని నూర్పిడి చేసేవారు. ఈ పద్ధతిలో వరి దంటును పూర్తిగా కిందకు కోసేవారు. అలా మిగిలిపోయిన కొయ్యలను కలియదున్ని మళ్లీ సాగు చేసేవారు. దీంతో కొయ్యలు కుళ్లిపోయి ఎరువుగా మారి భూసారం పెరిగేందుకు దోహదపడేది. కానీ కొన్నేళ్లుగా వరికోత యంత్రాలు అందుబాటులోకి రావడంతో వాటితోనే కోతలు చేపడుతున్నారు. వరికర్రలను పైపైన కోయడంతో కొయ్యలు మిగులుతున్నాయి. వాటికి నిప్పంటించి కాల్చి వేయడంతో పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు, కీటకాలు మృతి చెందుతాయని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో భూసారానికి నష్టం కలిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

పొంచి ఉన్న ప్రమాదం..

వరికొయ్య కాళ్లను కాలుస్తుండగా వీచే గాలులకు మంటలు వ్యాపించి సమీపంలో ఉన్న గడ్డివాములు కాలిపోయే అవకాశం ఉంది. అలాగే పొలాలకు దగ్గర ఉన్న పలు పంటలు కాలిపోయే పరిస్థితి ఉంటుంది. రైతులు వారి పొలాల్లోని వరి కొయ్యకాడలను కాల్చే సమయాల్లో చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవు. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. మంటలు విస్తరిస్తే నీటిని సరఫరా చేసే పైపులు, మొక్కలు దగ్ధమయ్యే ప్రమాదం ఉంది. దీంతో పాటు ఆ ప్రాంతంలో దట్టమైన పొగలతో వాయుకాలుష్యం ఏర్పడుతుంది. చేతికొచ్చిన పంటకు ఎలాంటి నష్టం జరగకుండా ఉండడానికి రైతులు పలు జాగ్రత్తలు పాటించాలి.

రైతులు ఇలా చేయాలి..

యంత్రాలతో వరి కోతలు చేపట్టే అన్నదాతలు తక్కువ ఎత్తులో కొయ్యలు మిగిలేలా చూసుకోవాలి. రోటవేటర్ సాయంతో వరికొయ్యలను భూమిలోనే కలియ దున్నితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. గడ్డి కుళ్లి సేంద్రియ ఎరువుగా మారుతుంది. పొటాషియం, నత్రజని, భాస్వరం మొక్కకు అందుతుంది. దున్నటానికి ముందు మార్కెట్‌లో దొరికే సింగిల్ సూపర్ పాస్ఫేట్ ఎకరాకు 150 కిలోలు చల్లితే త్వరగా మురిగి భూమిలో కలిసిపోతుంది. 20 రోజుల తర్వాత నాటువేస్తే రసాయన ఎరువులను ఎక్కువగా వాడాల్సిన అవసరం లేదు.

కొయ్యలు కలియదున్నాలి



వరి కోతలు పూర్తి కాగానే రైతులు సులువుగా వరి కొయ్యలకు నిప్పంటిస్తున్నారు. ఇలా చేయడంతో వాతావరణ కాలుష్యంతో పాటు మంటల వేడిమికి పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయి. ఇలా రైతులకు నష్టం జరుగుతుంది. వరి కొయ్యలను కలియ దున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఎరువుల భారం తగ్గడంతో పాటు ఖర్చుల భారం తగ్గుతుంది. చీడపీడలు, తెగుళ్ల తగ్గి పంటల దిగుబడి పెరుగుతుంది.

\- రాజేశ్, మండల వ్యవసాయాధికారి

అభివృద్ధి కోసం కలిసి పని చేద్దాం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

చింతలమానెపల్లి: నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించే దిశగా, గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని బాబాసాగర్, రవీంద్రనగర్2లలో ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇతర పథకాల అర్హుల ఎంపిక నిరంతరంగా జరిగే ప్రక్రియ అన్నారు. ప్రజలు స్థానికంగా జరిగే పనుల్లో నాణ్యత లోపిస్తే ప్రశ్నించాలని పేర్కొన్నారు. స్థానికంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన, గిరిజనేతరులకు భూముల పట్టాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బెంగాలీలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో త్వరలో కౌటాల మండలం మీదుగా జాతీయ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రాజెక్టులకు సంబంధించిన కాలువల నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, డిప్యూటీ తహసీల్దార్ మష్కూర్ అలీ, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు నాజిం హుస్సేన్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పద్మశాలీ సేవా సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: నూతనంగా ఎన్నికైన కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలీ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తులు చేసుకోవాలి



దహెగాం: మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్

దహెగాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం గ్యారంటీ పథకాల కోసం అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు, గెర్రె, గిరవెల్లి, కమ్మర్‌పల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పథకాల్లో భాగంగా ఇప్పటికే ఆర్టీసీలో మహిళలు ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించిందన్నారు. మిగతా ఐదు గ్యారంటీల కోసం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు పుప్పాల లక్ష్మి, సందికట్ల రమేష్, ఆయా శాఖల అధికారులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కౌటాల: ఆరు గ్యారెంటీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి తుమ్మిడిహెట్టి, గుండాయిపేట్ గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులను స్వీకరించారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్ నాగేపల్లి, కనికి గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

జైనూర్: ప్రజలు ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రభుదయ అన్నారు. మంగళవారం మండలంలోని రాసిమెట్ట, జామిని గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రతీ గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్ వాగ్మారే, పంచాయతీ కార్యదర్శి మధుకర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కనుల పండువగా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు



అక్షింతలు అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కౌటాల: మండల కేంద్రం మంగళవారం సాయంత్రం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. అయోధ్యలో ఈ నెల 22న రామాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని తలోడిలోని హనుమాన్ మందిరం నుంచి భక్తిశ్రద్ధలతో రాముడి విగ్రహం, అయోధ్య అక్షింతలతో నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. యాత్రలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొని రాముడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల నుంచి భారీగా వచ్చిన భక్తులు, యువకులు జైశ్రీరాం నినాదాలతో హోరెత్తించారు. తలోడి చౌరస్తా, మార్కెట్ ఏరియా, నదీమాబాద్ కాలనీ, రామాలయం, బస్టాండ్ ఏరియా మీదుగా సాయిబాబా ఆలయం వరకు యాత్ర సాగింది. కౌటాల సీఐ సాధిక్‌పాషా, ఎస్సై మధుకర్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ సభ్యులు ప్రబీర్ మండల్, మీతున్, తిరుపతి రెడ్డి, సత్తన్న, ఎల్ములే దత్తు, శివప్రసాద్, రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అక్షింతల అందజేత

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబుకు వీహెచ్‌పీ జాతీయ నాయకులు అయోధ్య రాముల వారి అక్షింతలు అందజేశారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల ఎమ్మెల్యే నివాసానికి విశ్వహిందు పరిషత్ జాతీయ జాయింట్ సెక్రటరీ స్థానుమలయన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాది రెడ్డిలు వెళ్లి అక్షింతలు అందించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ వచ్చే 15 రోజుల పాటు ప్రతీ ఇంటికి ఈ అక్షింతలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అయోధ్యలో రాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రజలు ఆస్వాదించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షింతలతో శోభాయాత్ర

లింగాపూర్: మండల కేంద్రంలోని పిట్టగూడ, జాముల్‌ధర, లింగాపూర్, పిక్లాతండా, కొత్తపల్లితో పాటు వివిధ గ్రామాలలో మంగళవారం శ్రీరామ భక్తులు శ్రీ రాముని అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు విరణ్, వినోద్‌జాదవ్, సుదర్శన్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేసిన శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: ఇంటింటికీ అయోధ్య అక్షింతలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, శిశు మందిర్ పాఠశాల జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ కొత్తపల్లి అనిత దంపతులు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరికి రాముని ఆశీర్వాదం ఉండాలని రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని 29వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ అయోధ్య రామ మందిరం ఫొటో, కరపత్రాలు అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌రూరల్: విద్యాబలోపేతం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో యూటీఎఫ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సంఘం క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విద్యా అభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఇందులాల్, హేమంత్ షిండే, ఉషన్న, రమేశ్, పీఆర్‌టీయూ సంఘం నాయకులు శ్రీనివాస్, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

తిర్యాణి: ఆటో బోల్తాపడి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మొర్రిగూడ గ్రామ శివారులో గల అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతపెల్లి పంచాయతీ పరిధిలోని నాయకపుగూడ గ్రామానికి చెందిన మెంద్రపు నారాయణ సోమవారం అర్ధరాత్రి ఐబీ తాండూర్ నుంచి మండల కేంద్రానికి తన ఆటోలో వస్తుండగా మార్గమధ్యలో మొర్రిగూడ శివారులో అడవి పంది ఒక్కసారిగా రోడ్డుపైకి దూసుకొచ్చింది. దానిని తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నారాయణ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయనను మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024 -25 సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆసిఫాబాద్ గురుకుల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు జనవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశపరీక్ష ఫిబ్రవరి 11వ తేదీన ఉంటుందన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూజలు నిర్వహిస్తున్న ప్రేంసింగ్ మహరాజ్

జైనూర్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని దీక్ష గురువు ప్రేంసింగ్ మహరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని రాంనగర్‌లో శ్రీ జగదంబా, సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లంబాడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ గణపత్, గ్రామ నాయక్, డావ్, కారోబారి తదితరులు ఉన్నారు.

శబరియాత్రకు అయ్యప్ప స్వాములు పయనం



శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములు

రెబ్బెన: కఠోర నియమనిష్ఠలతో కూడిన అయ్యప్ప దీక్షను చేపట్టిన స్వాములు దీక్షా కాలాన్ని పూర్తి చేసుకొని మంగళవారం హరిహర శుత అయ్యప్ప స్వామి ఆలయానికి తరలివెళ్లారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీ కోదండ రామాలయంలో ఇరుముడి కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తి చేసుకున్న స్వాములు మంగళవారం ఇరుముడులతో స్వామి వారి దర్శనం కోసం శబరిమల యాత్రకు తరలివెళ్లారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు గురుస్వామి జిల్లాల నాగయ్య, స్వాములు సుధాకర్, శ్రీనివాస్, మహేందర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



పరేడ్ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది

రెబ్బెన: రేంజ్ పరిధిలో విధులు నిర్వహించే అటవీశాఖ సిబ్బంది వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ విధుల్లో ముందుకు సాగాలని రెబ్బెన రేంజ్ అధికారి నిజామొద్దీన్ అన్నారు. అటవీశాఖ సిబ్బందికి ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్వహించే పరేడ్ కార్యక్రమాన్ని మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చ్‌ఫాస్ట్, సెల్యూట్, కతమ్‌తాల్‌లపై సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో మాట్లాడుతూ అడవి సంరక్షణలో కీలక పాత్ర పోషించే అటవీశాఖ సిబ్బంది నిత్యం విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బందిని ఉత్తేజపర్చేందుకు ప్రతీ 15 రోజులకు ఒకసారి పరేడ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్వో శ్రీధరాచారి, సెక్షన్ అధికారులు ఆత్రం రవీందర్, సతీశ్, కొమ్ము రవి, బాబు, బీట్ అధికారులు దేవేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

సాధారణ సెలవుదినంగా ప్రకటించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: సేవాలాల్ జయంతి నిర్వహించే ఫిబ్రవరి 15న సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని గోర్‌సేన సంఘం నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేను కలిసి వినతిపత్రం అందించారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ జయంతి రోజున సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో బాదవత్ రవీందర్, భూక్య ప్రవీణ్, రాజేందర్, విజేందర్ తదితరులు ఉన్నారు.

సమష్టి కృషితో జిల్లా అభివృద్ధి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ఆసిఫాబాద్: సమష్టి కృషితో జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో పాటు పలువురు అధికారులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆర్డీవో కదం సురేశ్, ఏడీ సోమేశ్వర్, డీఎస్‌వో తారామణి, స్పెషల్ సబ్ జైల్ జైలర్ ప్రేమ్‌కుమార్, న్యాయవాదులు ఎండీ రజీహైదర్, పంచదార దీపక్‌రావు, వసతి గృహాల సంక్షేమాధికారులు, సిబ్బంది ఉన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న సంక్షేమ వసతి గృహాధికారులు, ట్రెజరీ ఉద్యోగులు



శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి



శుభాకాంక్షలు తెలుపుతున్న స్పెషల్ సబ్‌జైలు జైలర్ ప్రేమ్‌కుమార్

ఎస్ఈని కలిసిన యూనియన్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వాసుదేవ్‌ను, ఎస్ఏవో ఈశ్వర్‌ను 1104 యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు విలాస్ కుమార్, కార్యదర్శి వెంకటేష్, నాయకులు రమేశ్, మహేందర్, రాజేందర్, ఎండీ గౌస్ పాల్గొన్నారు.

రెజ్లింగ్ కుస్తీపోటీల్లో సత్తా

నార్నూర్: మండలంలోని జామ్‌డా బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.మౌనిక, ఎం.త్రిసా, బి.దేవశాల రెజ్లింగ్ కుస్తీ పోటీలో సత్తా చాటినట్లు హెచ్ఎం చౌహాన్ నెహ్రూ, పీడీ అడే విశ్వనాథ్ తెలిపారు. ఉట్నూర్‌లోని కుమురం భీం కాంప్లెక్స్‌లో జిల్లాస్థాయి ఇంటర్ సొసైటీ లీగ్ సెలక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రెజ్లింగ్ కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబర్చారు.